

సహకారంలో ఆదర్శం..

కోహెడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం. రూ.16 కోట్లతో కార్యకలాపాల నిర్వహణ కొనసాగిస్తూ.. ప్రగతి పథంలో ఆదర్శంగా నిలుస్తుంది.

వివరాలు 8లో ▸



వైద్య సేవలపై ఆరా

తూప్రాన్ (సీహెచ్‌సీ), కొడిపల్లి పీహెచ్‌సీని ఒడిశా బృందం బుధవారం సందర్శించింది.

వివరాలు 8లో ▸



రెండో రోజూ అవే నిరసనలు

ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామ, వార్డు సభల్లో అధికారులకు నిలదీతలు, నిరసన సెగలు తగిలాయి.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి



ప్రజల సమస్యలు వింటున్న నిర్మలారెడ్డి

సంగారెడ్డి: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకే రాష్ట్ర ప్రభుత్వం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డి పేర్కొన్నారు. సంగారెడ్డిలోని 22వ వార్డు రామ్ నగర్‌లో నిర్వహించిన గ్రామసభ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరువ చేసేందుకు నిర్వహిస్తున్న గ్రామ, వార్డు సభలను ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తు చేసుకోకుండా ఉంటే ఇప్పుడూ ఈ వార్డ్ సభలలో చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి ఆంజనేయులు, సీడీసీ చైర్మన్ రామ్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభల్లోనే లబ్ధిదారుల ఎంపిక

జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో స్వప్న



గ్రామసభలో మాట్లాడుతున్న స్వప్న

హత్నూర(సంగారెడ్డి): సంక్షేమ పథకాల కోసం లబ్ధిదారులను గ్రామసభల్లోనే ఎంపిక చేసి జాబితాను ప్రకటిస్తున్నట్లు జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో స్వప్న పేర్కొన్నారు. హత్నూర మండలం కాసాల ,మల్కాపూర్, ప్రజా పాలన గ్రామ సభలలో బుధవారం స్వప్న పాల్గొని మాట్లాడారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇళ్ల ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తులను ఇప్పటికీ స్వీకరిస్తామని స్పష్టం చేశారు. మండలంలోని నాగుల్దేరిపల్లి గ్రామసభలో తహసీల్దార్ పర్వీన్ షేక్ పాల్గొని లబ్ధిదారుల పేర్లను ప్రకటించారు. ఈ గ్రామ సభల్లో ఎంపీడీవో శంకర్,ఎంపీఈవో యూసుఫ్ ఆయా శాఖల అధికారులు గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉత్తమంగా బోధించాలి

డీఈవో వెంకటేశ్వర్లు



పాఠశాలలో తనిఖీ చేస్తున్న డీఈవో

కల్హేర్(నారాయణఖేడ్): విద్యార్థులకు ఉత్తమ బోధన చేయాలని డీఈవో వెంకటేశ్వర్లు ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం సిర్గాపూర్ మండలం జమ్లా తండా, లక్ష్మణ్ నాయక్ తండా పాఠశాలలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనం పథకంను పరిశీలించారు. డీఈవో వెంట సీఆర్‌పీ శివకుమార్ ఉన్నారు.

అపోహలు లేకుండా చూడాలి: అంజయ్య



దరఖాస్తులు స్వీకరిస్తున్న అంజయ్య

రాయికోడ్(అందోల్): రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల జారీ పథకాలు ఈ నెల 26 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రజల్లో అపోహలు లేకుండా అధికారులు అన్ని విషయాలను వివరించాలని జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ జి.అంజయ్య సూచించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించేపై పథకాలు అర్హులందరికీ చేరేలా అధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. నిజమైన అర్హులందరికీ పథకాలు మంజూరవుతాయని స్పష్టం చేశారు. సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలనపై ప్రజలు పూర్తి సంతృప్తిగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తహా, సొసైటీ మాజీ చైర్మన్ నజీర్, హాస్నాబాద్ మాజీ ఎంపీటీసీ గంజి విఠల్, స్థానికులు పాల్గొన్నారు.

ఆ పోస్టింగ్ గుట్టు ఎవరికెరుక!

- సస్పెన్షన్ వేటు పడిన సబ్ రిజిస్ట్రార్లలో ఒకరికి పోస్టింగ్
- మరొకరు సైతం తీవ్ర ప్రయత్నాలు
- సీజ్డ్ డాక్యుమెంట్లు సైతం వెనక్కి..
- ఐదు నెలల్లోనే కేసు నీరుగారిపోతోందనే అనుమానాలు
- అటకెక్కిన అక్రమ రిజిస్ట్రేషన్ల కేసు

రాష్ట్రంలోనే సంచలనం రేపిన అక్రమ రిజిస్ట్రేషన్ల కేసు నీరు గారిపోయిందా..? బదిలీపై వెళుతూ చివరి రోజు రాత్రికి రాత్రి వందకు పైగా డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేసి వ్యవహారాన్ని గుట్టు చప్పుడు కాకుండా అటకెక్కించారా? తాజా పరిణామాలను పరిశీలిస్తే అవుననే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ అక్రమ రిజిస్ట్రేషన్లు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొని సస్పెన్షన్ వేటు పడిన ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లలో ఒకరికి ఐదు నెలలు కూడా తిరగకముందే తిరిగి పోస్టింగ్ ఇచ్చేయడం ఆశాఖ వర్గాల్లో ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మరో సబ్ రిజిస్ట్రార్ కూడా తన పోస్టింగ్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తునట్లు ఆశాఖ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: అవినీతి నిరోధకశాఖ (ఏసీబీ) అధికారులు ఐదు నెలల క్రితం జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంపై దాడులు నిర్వహించిన సంగతి తెలిసిందే. హైదరాబాద్ ప్రధాన కార్యాలయం నుంచి వచ్చిన ఏసీబీ అధికారుల బృందాలు రెండు రోజుల పాటు ఈ కార్యాలయంలో సోదాలు చేయడం రాష్ట్రంలోనే కలకలం రేపింది. ఈ సోదాల సమయంలో కరెన్సీ కట్టలు కార్యాలయం కిటికీల నుంచి బయటకు విసిరేయడం సంచలనంగా మారింది. కార్యాలయంలోని అధికారుల వద్ద కూడా భారీ మొత్తంలో నగదును ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఒక్కరోజే సుమారు వందకు పైగా డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ జరిగినట్లు గుర్తించారు. ఈ డాక్యుమెంట్లను ఏసీబీ జప్తు చేసి హైదరాబాద్ కార్యాలయానికి తరలించింది. జిల్లా కేంద్రంలో ఉండే ఏసీబీ అధికారులు కాకుండా, హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రత్యేక బృందాలు ఈ సోదాలు చేశాయి. ఈ కేసులో ఈ కార్యాలయంలోని ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లపై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. ఐదు నెలలు కూడా తిరగక ముందే సస్పెన్షన్ వేటు పడిన సబ్ రిజిస్ట్రార్‌లలో ఒకరు తాజాగా పోస్టింగ్‌లో చేరడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. పైగా ఎంతో కీలక జిల్లా అయిన రంగారెడ్డి జిల్లాలో కీలక స్థానంలో ఈ అధికారికి పోస్టింగ్ దక్కడం గమనార్హం. ఈ కేసులో సస్పెన్షన్‌లో ఉన్న మరో సబ్ రిజిస్ట్రార్ కూడా తన పోస్టింగ్ కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆశాఖ వర్గాల్లో చర్చ జరుగుతోంది.



జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయం

పోర్టల్‌లో సీజ్డ్ డాక్యుమెంట్లు అప్‌లోడ్

ఆకస్మిక తనిఖీల సందర్భంగా సీజ్ చేసిన డాక్యుమెంట్లను హైదరాబాద్‌లోని ఏసీబీ కార్యాలయానికి తరలించారు. సీజ్ చేసిన ఈ డాక్యుమెంట్లు సైతం తిరిగి జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయానికి చేరాయి. ఆయా ఆస్తులను రిజిస్ట్రేషన్లు చేయించుకున్న వారు తమకు డాక్యుమెంట్లు కావాలని అడుగుతున్నారనే కారణంగా రిజిస్ట్రేషన్ అధికారులు లేఖ రాయడంతో ఏసీబీ ఈ డాక్యుమెంట్లను తిరిగి ఇచ్చేసినట్లు ఆశాఖ వర్గాలు చెబుతున్నాయి. ఈ డాక్యుమెంట్లను స్కాన్ చేసి పోర్టల్‌లో అప్‌లోడ్ కూడా చేశారు.

స్కాన్ చేసేందుకు కావాలని అడిగాం

ఏసీబీ అధికారులు సీజ్ చేసిన డాక్యుమెంట్లు తిరిగి వచ్చాయి. రిజిస్ట్రేషన్ల శాఖ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసేందుకు స్కాన్ కోసం డాక్యుమెంట్లు కావాలని ఏసీబీ అధికారులకు గతంలో లేఖ రాశాం. ఈ మేరకు ఏసీబీ అధికారులు ఈ డాక్యుమెంట్లు ఇచ్చేశారు. వాటిని స్కాన్ చేసి పోర్టల్‌లో అప్‌లోడ్ చేశాం. ఆకస్మిక తనిఖీలకు సంబంధించి ఏసీబీ అధికారుల నుంచి నివేదిక ఇంకా రాలేదు. ఈ నివేదిక రావాల్సి ఉంది.

–వల్లి సుబ్బులక్ష్మి,
జిల్లా రిజిస్ట్రార్, సంగారెడ్డి

కార్డుల మంజూరు నిరంతర ప్రక్రియ

కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి: సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితాలో పేర్లు లేని వారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల మంజూరు చేయడం నిరంతర ప్రక్రియని కలెక్టర్ వల్లురు క్రాంతి స్పష్టం చేశారు. జిల్లాలోని అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయడమే లక్ష్యంగా గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. చౌటకూర్ మండలం బద్రి గూడెంలో బుధవారం గ్రామసభకు కలెక్టర్ క్రాంతి హాజరై మాట్లాడారు. సంక్షేమ పథకాలకు అర్హులైన ప్రతీ ఒక్కరు గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాలలో అర్హులైన వారు ఆయా సంక్షేమ పథకాల కింద దరఖాస్తులు చేసుకునేలా విద్యావంతులు, యువకులు, గ్రామ పెద్దలు చొరవ చూపాలని కోరారు. గ్రామసభలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో పాండు, తహసీల్దార్ కిరణ్ కుమార్, వ్యవసాయాధికారి ప్రవీణ, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



ప్రజా సమస్యలు వింటున్న కలెక్టర్ క్రాంతి

ఓటర్ నమోదుపై అవగాహన కల్పించాలి



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి

అదనపు కలెక్టర్లు మాధురి, చంద్రశేఖర్

సంగారెడ్డి జోన్: ప్రతీ పౌరుడు తమ హక్కులను వినియోగించుకోవాలని, 18 సంవత్సరాలు నిండిన ప్రతీ వ్యక్తి ఓటర్‌గా పేరు నమోదు చేసుకోవాలని అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో ఓటర్ ప్రచార రథాన్ని బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 'నథింగ్ లైక్ ఓటింగ్ ఓట్ ఫర్ ష్యూర్' పేరుతో ప్రజాస్వామ్య హక్కులపై అవగాహన కోసం ప్రచారం చేపట్టనున్నామన్నారు. ఈ ప్రచార రథం ద్వారా ప్రజలందరికీ ఓటు హక్కు విలువను గుర్తుచేసి, ఓటరుగా తమ పేరును నమోదు చేసుకోవడంలో ఉన్న ప్రాధాన్యతను వివరించనున్నట్లు తెలిపారు. ఈనెల 22 నుంచి 25 వరకు జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో తిరుగుతుందని వెల్లడించారు. ఈ నెల 25న 15వ జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ప్రత్యేక ర్యాలీ నిర్వహిస్తామని తెలపారు. ఈ ర్యాలీలో ప్రజలంతా ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఓటర్ నమోదు ప్రక్రియపై సందేహాలు లేదా సమాచారం కోసం టోల్ ఫ్రీ నంబర్ 1950కు కాల్ చేసి వివరాలను తెలుసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో పద్మజ రాణి, ఏవో పరమేశ్, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ ఆంటోని, టీఎస్ఎస్ కళాకారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

జహీరాబాద్‌కు పాతపంటల జాతర

జహీరాబాద్: ఎడ్లబండ్లతో కూడిన పాతపంటల జాతర జహీరాబాద్‌కు చేరుకుంది. జహీరాబాద్‌లోని కెఫే ఎత్నిక్ వద్ద బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎస్.ఐ కాశీనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చిరు ధాన్యాల ప్రాధాన్యత గురించి వివరించారు. చిరుధాన్యాల ఆహారంలో తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు. తిరిగి ప్రజలు చిరుధాన్యాల ఆహారం పట్ల ఆసక్తి చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో డీడీఎస్ ఈడీ దివ్య, జాతర కో–ఆర్డినేటర్లు వినయ్‌కుమార్, మంజుల, సిబ్బంది నర్సమ్మ, పూలమ్మ పాల్గొన్నారు.



ఎడ్లబండ్ల యాత్రను ప్రారంభిస్తున్న ఎస్ఐ

ప్రజాసేవ చేయడం అదృష్టం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం ఓ అదృష్టమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డు పరిధిలలో రూ.17.80కోట్ల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు బుధవారం ఎమ్మెల్యే ప్రారంభోత్సవాలు, శంకుస్థాన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...ప్రజల అభ్యున్నతికి, అభివృద్ధికి పాటుపడేవారే నిజమైన నాయకులన్నారు. గడిచిన ఐదేళ్ల కాలంలో తెల్లాపూర్ మున్సిపాలిటీ రూ.220కోట్లతో అభివృద్ధి జరిగి అందరికీ ఆదర్శంగా నిలిచామని తెలిపారు. ప్రతీ ఇంటికి రక్షిత త్రాగునీటి అందించడంతోపాటు భారీ రిజర్వాయర్లను నిర్మించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లలిత, వైస్ చైర్మన్ రాములు గౌడ్ పాల్గొన్నారు.



ఫంక్షన్‌హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గూడెం

మైనార్టీ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

జహీరాబాద్ టౌన్: మండలంలోని అల్గోల్ బాలుర మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలలో 2025–26 విద్యాసంవత్సరానికి గాను 5,6 తరగతులలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులను కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ జె.రాములు బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. 5వ తరగతిలో ముస్లిం మైనార్టీ సీట్లు 51, క్రిస్టియన్ 5, జైన్, పార్శీ, బుద్దులు, సిక్కులకు 4, నాన్‌మైనార్టీ విద్యార్థులకు 20 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ గ్రూపులో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. అర్హులైవారు ఆన్‌లైన్‌లో లేదా గురుకుల పాఠశాలలో ఫిబ్రవరి 28 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఉత్తమ ప్రతిభ కనబరచాలి



క్రీడల్లో పాల్గొన్న పోలీసు అధికారులు

జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్

సంగారెడ్డి జోన్: ఈ నెల 28న కరీంనగర్‌లో జరగనున్న 3వ రాష్ట్రస్థాయి పోలీసు స్పోర్ట్స్ మీట్‌లో సంగారెడ్డి జిల్లా ఉత్తమ ప్రతిభ కనబరచాలని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్ ఆకాంక్షించారు. జిల్లా ఎస్పీ కార్యాలయం ఆవరణలో బుధవారం రాష్ట్రస్థాయిలో పాల్గొనేందుకు వివిధ క్రీడలలో జట్లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... జిల్లాలోని నాలుగు సబ్–డివిజన్లు, ఆర్మడ్ రిజర్వ్ విభాగాలకు పోటీలను నిర్వహించి షార్ట్ రన్, లాంగ్ రన్, లాంగ్ జంప్, హై జంప్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖో–ఖో, టగ్ ఆఫ్ వార్ వంటి వివిధ క్రీడలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశామన్నారు. పోలీసింగ్ అనేది చాలా సవాళ్లతో కూడుకుందని, అలాంటి చాలెంజ్‌లను సమర్థవంతంగా ఎదుర్కొని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పిలుపునిచ్చారు. పోలీసులకు శారీరక, మానసిక దృఢత్వం చాలా కీలకమన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సంజీవరావ్, ఏఆర్. డీఎస్పీ నరేందర్, ఆర్.ఐలు రామారావ్, రాజశేఖర్ రెడ్డి, డానియెల్, ఆర్.ఎస్ఐలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'బేటీ బచావో బేటీ పడావో'పై అవగాహన

నారాయణఖేడ్: బేటీ బచావో..బేటీ పడావో కార్యక్రమంపై జిల్లా మహిళాశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఖేడ్‌పట్టణంలోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళా సంక్షేమశాఖ సాధికారి కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ యాదగిరి బాలల హక్కులు, చట్టాలు, బాల్య వివాహాల నిరోధం, బాలల అక్రమ రవాణాలపై అవగాహన కల్పించారు. ఇటువంటి ఘటనలు ఎక్కడైనా జరిగితే హెల్ప్‌లైన్ నంబరు 181 లేదా 1098కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జమున, మంజుల, ప్రిన్సిపల్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూళ్లపై శీతకన్ను!

- కేవలం 18 శాతమే వసూలు
- పథకాల సర్వేలో కార్యదర్శులు బిజీ
- గడువులోగా లక్ష్యం సాధ్యమేనా..!

సంగారెడ్డి జోన్: గ్రామాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేస్తుంటాయి. కేటాయించిన నిధులతో అభివృద్ధి సాధించటంతో పాటు గ్రామ పంచాయతీకి సంబంధించిన పన్నులు సైతం ఎంతో దోహదపడుతుంటాయి. జిల్లాలో వివిధ మండలాల్లోని పంచాయతీల వారీగా ప్రతీఏటా ఇంటి పన్ను వసూలు చేస్తుంటారు. గతేడాది నవంబరు, డిసెంబరు నెలల నుంచి పన్ను వసూలు చేయటం ప్రారంభించారు. 100శాతం వసూలు చేయటమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటివరకు 18శాతం పన్ను వసూలు చేశారు.

జిల్లాలో 2లక్షలకుపైగా ఇళ్లకు పన్ను వసూళ్లు

జిల్లాలో ఉన్న 636 గ్రామ పంచాయతీలలో 2,87,184 ఇళ్లకుగాను పన్ను వసూలు చేయనున్నారు. ఈ ఆర్థిక ఏడాదిలో నూతన గ్రామపంచాయతీలు ఏర్పడినప్పటికీ పాత పంచాయతీ పరిధి ప్రకారమే పన్ను వసూలు చేయనున్నారు. ఈ మేరకు 2024–2025 ఆర్థిక సంవత్సరానికి రూ.41,65,37,038లు వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆయా గ్రామాలవారీగా పన్ను వివరాలను ఆన్‌లైన్‌లో ఉంచారు. ఇప్పటివరకు జిల్లాలో రూ.8,33,55,102లు వసూలు చేశారు. గత సంవత్సరం కంటే ఈ ఏడాది 5శాతం పెరిగినట్లు సమాచారం.



సిద్దాపూర్ గ్రామంలో పన్ను రశీదును అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శి

గ్రామాభివృద్ధి కోసం కేటాయింపు

జిల్లాలోని వివిధ గ్రామ పంచాయతీలలో సేకరించిన పన్నులను గ్రామాభివృద్ధికి కేటాయిస్తారు. సేకరించిన పన్ను వసూలు మొత్తాన్ని ముందుగా పంచాయతీ ఖాతాలో చలాన్ ద్వారా జమ చేసి, ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. గ్రామంలో మౌలిక వసతులు త్రాగు నీరు, వీధి దీపాల నిర్వహణ, పారిశుద్ధ్యంతోపాటు అభివృద్ధి కోసం ఖర్చు చేస్తారు.

పన్ను వసూలుకు ప్రణాళికలు

ప్రతీ సంవత్సరం మాదిరిగానే 100శాతం పన్ను వసూలు చేసేందుకు సంబంధిత శాఖ అధికారులు ప్రణాళికలను రూపొందించారు. గతేడాది నవంబర్‌లోనే పన్ను వసూలు ప్రక్రియను చేపట్టారు. జనవరిలో వసూళ్లు కొద్దిగా నెమ్మదించాయి. గ్రామాలలో సర్వేతోపాటు గ్రామసభల నిర్వహణ కొనసాగుతుంది. సభలు ముగియగానే ఫిబ్రవరి నుంచి పన్ను వసూళ్ల వేగం పుంజుకోనుంది. నిర్దేశిత సమయంలో పన్ను వసూళ్ల ప్రక్రియ ముగించేందుకు అధికారులు చర్యలు తీసుకోనున్నారు.

గడువులోగా వసూలు చేస్తాం



ఇప్పటివరకు రూ.8 కోట్లకు పైగా పన్ను వసూలు చేశారు. మార్చి చివరినాటికి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. వసూలు చేసిన పన్నుతో గ్రామాభివృద్ధి కోసం కేటాయిస్తారు. పన్ను వసూలుకు ప్రతీ ఒక్కరు సహకరించాలి.

–సాయిబాబా,
జిల్లా పంచాయతీ అధికారి, సంగారెడ్డి



ఉర్సు ఉత్సవాల్లో ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని హజ్రత్ ఫతే ఖాన్ సాత్రి మజ్జూబ్ రహేమాతుల్లా అలైహి 140వ ఉర్సు ఉత్సవాల్లో భాగంగా ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి సభ్యులు పూల చాదర్‌ని సమర్పించి దర్గాలో ప్రార్థనలు చేశారు. ఈ ప్రార్థనల్లో ఫోరమ్ అధ్యక్షుడు శ్రీధర్ మహేంద్ర, ఉపాధ్యక్షుడు సజ్జాద్‌ఖాన్ దర్గా కమిటీ నిర్వాహకులు గులాం సమద్ సందానిలు పాల్గొన్నారు.

–సంగారెడ్డి రూరల్



కేతకీలో ఎమ్మెల్యేల పూజలు

శ్రీ కేతకి సంగమేశ్వర ఆలయంలో బుధవారం జహీరాబాద్, నర్సాపూర్ ఎమ్మెల్యేలు మాణిక్‌రావు, సునీతారెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు. వీరిని ఆలయ అర్చకులు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించి శాలువాతో సత్కరించారు.

–ఝరాసంగం(జహీరాబాద్)

క్లుప్తంగా

గ్రామ దేవతలకు బోనాలు



బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని టేకూర్ గ్రామంలో బుధవారం బోనాలు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పంటలు బాగా పండి, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ గ్రామ దేవతలు ఊర డమ్మ, లక్ష్మీదేవి, మైసమ్మకు పూజలు చేశారు. అనంతరం మహిళలు అమ్మవార్లకు బోనాలు సమర్పించారు.

నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, నాయకులు

పటాన్‌చెరు: ఇటీవల తిరుపతి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పటాన్‌చెరు పట్టణానికి చెందిన సందీప్ షా దంపతుల పార్థీవా దేహాలకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి దంపతులు నివాళులర్పించారు. బుధవారం ఉదయం పట్టణంలోని సీతారామయ్య కాలనీలోని సందీప్ షా కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాదం అనంతరం.. తిరుపతిలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టు మార్టం అనంతరం మంగళవారం రాత్రి ప్రత్యేక వాహనంలో పటాన్‌చెరులోని ఆయన నివాసానికి తీసుకొని వచ్చారు. సందీప్ షా మరణం తనను తీవ్రంగా కలిచి వేసిందని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. తన రాజకీయ ప్రస్థానంలో సందీప్ కీలక పాత్ర పోషించారని తెలిపారు. వారి కుటుంబానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటామన్నారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఓఎల్ఎక్స్ ద్వారా సైబర్ మోసం

రూ.1.34 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు

కల్హేర్(నారాయణఖేడ్): సైబర్ నేరగాడి మాయలో పడి ఓ వ్యక్తి డబ్బులు పోగొట్టుకున్న ఘటన సిర్గాపూర్ మండల కేంద్రంలో బుధవారం ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్ఐ డి.వెంకట్‌రెడ్డి కథనం ప్రకారం.. సిర్గాపూర్‌కు చెందిన మచ్కూరి పవన్‌కుమార్ స్థానికంగా ఫొటో స్టూడియో నిర్వహిస్తున్నాడు. ఇటీవల ఓఎల్ఎక్స్‌లో కెమెరా వెతికాడు. తక్కువ ధరకు కెమెరా వస్తుందని సైబర్ నేరగాడు ఆశ చూపగా ఫోన్‌లో సంప్రదించాడు. హైదరాబాద్ వెళ్లి కెమెరా చూసి వెళ్లిపోయాడు. కొద్దిసేపటి తర్వా ఆన్‌లైన్ ద్వారా రూ.1.34 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేశాడు. అనంతరం సైబర్ నేరగాడు ఫోన్ స్విచ్ఛాఫ్ చేయడంతో మోసపోయినట్లు బాధితుడు గుర్తించి 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేశాడు. అప్పటికే రూ.56 వేలు నగదు డ్రా చేశారు. మిగితా రూ. 78 వేలు హోల్డ్‌లో పెట్టారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

బాలిక అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: మానసిక స్థితి సరిగా లేని బాలిక అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ ఆసిఫ్ అలీ కథనం మేరకు.. పటాన్‌చెరు పట్టణంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన తేజస్విని(15) ఇంటి నుంచి 21న వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. కూతురు అదృశ్యంపై తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

జొన్నలో తెగుళ్లు నివారించాలి

కల్హేర్ (నారాయణఖేడ్): జొన్న సాగులో తెగుళ్ల నివారణ చర్యలు చేపట్టాలని ఏడీఏ నూతన్‌కుమార్ రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని రాపర్తిలో జొన్న, వరి సాగును పరిశీలించారు. జొన్నలో రసం పీల్చే పురుగు, మొగి పురుగు బెడద గుర్తించారు. పంట సాగు కోసం కాంప్లెక్స్ ఎరువుల వాడకం తగ్గించాలని అవగాహన కల్పించారు. అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ వెంకటేశం, ఏఈఓ కృష్ణవేణి పాల్గొన్నారు.

సహకారంలో ఆదర్శం.. సేవల్లో ఘనం

లాభాల బాటలో కోహెడ పీఏసీఎస్

- 15 ఏళ్లలో రూ.14 కోట్ల 30 లక్షల ఆదాయం
- ప్రతీయేటా రూ.కోటి లాభం
- రైతుల అభివృద్ధిపై ప్రత్యేక కృషి
- ఇటీవలె మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా నూతన కార్యాలయం ప్రారంభం
- ఉత్తమ సహకార సంఘంగా ఎంపిక



కోహెడ పీఏసీఎస్ కార్యాలయం

కోహెడ(హుస్నాబాద్): సహకార సంఘాలు చాలా వరకు రుణ వితరణ, ఇతర సేవలకే పరిమితం అవుతున్నాయి. మరికొన్ని సంఘాలు రైతుల అవసరాలు, వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా వాణిజ్య సరళిలో తమ వ్యాపార కార్యకలాపాలను విస్తరిస్తూ సంఘం, రైతుల అభివృద్ధికి తోడ్పడుతున్నాయి. ఈ కోవకే చెందినదే కోహెడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం. రూ.16 కోట్లతో కార్యకలాపాల నిర్వహణ కొనసాగిస్తూ.. ప్రగతి పథంలో ఆదర్శంగా నిలుస్తుంది.

శనిగరం, వింజపల్లి, సముద్రాల సంఘాల విలీనంతో మండలం మొత్తానికి ఒకే సంఘంగా 2005లో కోహెడ ప్రాథమిక వ్యవసాయ సంఘం ఏర్పాటైంది. రూ.1.70 కోట్లు వైద్యనథన్ ప్యాకేజీ ద్వారా తొలిసారిగా సంఘానికి ఆర్థిక సహకారం లభించింది. ఈ నిధులను డీసీసీబీలో జమ చేశారు. 2010లో డీసీసీబీలో జమ ఉన్న నిధులను విత్ డ్రా చేసి సంఘం సొంతంగా లావాదేవిలను ఆరంభించింది.

నూతన కార్యాలయం

కోహెడ పీఏసీఏస్ నూతన కార్యాలయం భవనాన్ని ఇటీవలె మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా కార్యాలయం ప్రారంభించారు. నాబార్డు లోన్ ద్వారా రూ.85 లక్షలు, మిగితా రూ.15 లక్షలు సహకార సంఘం నిధుల నుంచి నూతన కార్యాలయం నిర్మించారు. కార్యాలయంలో లాకర్ సదుపాయం, ఎరువుల నిల్వ కోసం భవనంలో ప్రత్యేక గదులు ఏర్పాటు చేశారు. నూతన హంగులతో కార్యాలయం రూపుదిద్దుకుంది. కార్యాలయం నిర్మాణం పై మంత్రి సంతృప్తి చెందారు.

రూ.16 కోట్లతో కార్యకలాపాలు

రూ.1.70 కోట్ల నిధులతో ప్రారంభమైన సంఘం 15 ఏళ్లలో రూ.16 కోట్లతో కార్యకలాపాలు కొనసాగిస్తుంది. ఈ సంఘంలోని 1,388 మంది సభ్యులకు సుమారుగా రూ.14.50 కోట్లు స్వల్ప, దీర్ఘకాలిక, వ్యక్తిగత, బంగారు ఆభరణాలపై రుణాలు అందించి.. వారి ఆర్థికాభివృద్ధికి బంగారు బాటలు వేస్తుంది. ఈసారి వివిధ రకాల డిపాజిట్ల రూపకంగా రూ.1.04 కోట్ల నికర లాభం సమకూర్చింది.

15 ఏళ్లలో రూ.14.30 కోట్ల ఆదాయం

కోహెడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుంది. బైక్‌లు, ట్రాక్టర్లు, వ్యక్తిగత రుణాలు, ఎరువుల వ్యాపారం, క్రాప్ లోన్‌ల మీద వడ్డీ, వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లు, పాల సంఘాలకు రుణాలు అందించి 15 ఏళ్లలో రూ.14.30 కోట్లు నిధుల నిల్వ చేశారు. దీంతో గతంలో సిద్దిపేట జిల్లాలో ఉత్తమ సహకార సంఘంగా ఎంపికైంది. రైతు కార్యకలాపాలు ఆన్‌లైన్ దిశగా కార్యచరణ సిద్ధం చేసి.. సాంకేతిక రంగం సద్వినియోగంపై ముందడుగు వేశారు.

తక్కువ వడ్డీతో రుణాలు



తక్కువ వడ్డీతో పంట రుణాలు అందిస్తున్నారు. బంగారు నగలు తాకట్టుతో అప్పులు ఇస్తుంద్రు. వడ్డీ వ్యాపారస్తుల చేతిలో మోసపోకుండా సహకార సంఘం కార్యాలయంలో అప్పులు అందిస్తున్నారు. దీంతో మాకు ఎలాంటి బాధ లేదు. చాలా సంతోషంగా ఉంది.

– చింతలపెల్లి తిరుపతిరెడ్డి, రైతు గొట్లమిట్ట

అభివృద్ధిలో సమష్టి కృషి



ప్రభుత్వ ప్రోత్సాహం, పాలక వర్గం సమష్టి సహకారం ద్వారా అభివృద్ధిలో ముందుకెళ్తున్నాం. రైతు కుటుంబాలకు తక్కువ వడ్డీతో ప్రత్యేక రుణాలు అందిస్తూ వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నం. విత్తనాలు, ఎరువులు సకాలంలో సబ్సిడీపై అందిస్తున్నం తక్కువ వడ్డీతో పంట, బంగారు ఆభరణాలపై రుణాలు అందిస్తున్నం. ఫిబ్రవరి రెండో వారంలో పదవి కాలం ముగియనుంది. సంఘం అభివృద్ధిలో భాగస్వాములుగా నిలిచిన పాలక వర్గం, కార్యాలయం సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు.

– పేర్యాల దేవేందర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్

బాధ్యతాయుతంగా పని చేస్తున్నం



సహకార సంఘం కార్యకలాపాల వ్యవహారాలపై పాలకవర్గం ప్రోత్సాహంతో బాధ్యతాయుతంగా పని చేస్తున్నం. ఇచ్చిన రుణాలను గడువు లోపు ఎప్పటికప్పుడూ సిబ్బందితో కలిసి వసూళ్లు చేస్తున్నం. రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచుతున్నాం. సహకార సంఘం లావాదేవీలపై పాలకవర్గంతో సమీక్షలను నిర్వహిస్తున్నాం.

– ముంజ మల్లికార్జున్‌గౌడ్, పీఏసీఎస్ సీఈఓ

వేర్వేరు చోట్ల నలుగురు బలవన్మరణం

జీవితంపై విరక్తి చెంది రైతు



చీమల రాజు (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): జీవితంపై విరక్తి చెంది ఉరేసుకొని రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల కేంద్రమైన మిరుదొడ్డిలో చోటు చేసుకుంది. బుధవారం మిరుదొడ్డి పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన చీమల రాజు (45) తనకున్న మూడెకరాల్లో వ్యవసాయం చేసుకుంటూ భార్య ప్రమీల, 14 ఏళ్లలోపు ఇద్దరు కూతుర్లు, కుమారుడిని పోషించుకుంటున్నాడు. ఇటీవల వ్యవసాయ పనులు ముగించుకొని బైక్‌పై ఇంటికొస్తుండగా అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో ఎడమకాలు విరిగిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతోపాటు అనారోగ్యం తోడైంది. పరిస్థితి విషమంగా మారడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చూయించుకోగా కాలు పూర్తిగా విషపూరితంగా మారిందని, తొలగించాల్సి వస్తుందని, లేదంటే ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని డాక్టర్లు చెప్పారు. దీంతో మనోవేదనకు గురై కుంగిపోయాడు. మంగళవారం రాత్రి తన గొర్రెల కొట్టంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బోయిని పరుశరాములు తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి

పటాన్‌చెరు టౌన్: ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామానికి చెందిన కూలీ పని చేసే మాణిక్యం (45)ని 12 భార్య వదిలిపెట్టి వెళ్లిపోయింది. అప్పటి నుంచి మాణిక్యం తల్లి వద్దే పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామంలో ఉంటున్నాడు. మంగళవారం రాత్రి మాణిక్యం మద్యం తాగి ఇంటికొచ్చాడు. అర్థ రాత్రి తల్లి నిద్రలేచి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకొని కనిపించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేధింపులతో వివాహిత

మద్దూరు(హుస్నాబాద్): అత్తింటి వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ షేక్ మహబూబ్ కథనం మేరకు.. దూల్మిట్ట మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన లింగాల సరిత(27)కి ఐదేళ్ల కిందట రమేశ్ అనే వ్యక్తితో వివాహం జరిగింది. భార్యాభర్తల మధ్య తరచూ వరకట్నం కోసం గొడవలు జరుగుతుండేవి. వారం రోజుల కిందట వరకట్నం కోసం మరోసారి వేధించడంతో 19న ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మేనత్త భూదవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త రమేశ్, అత్త సమ్మవ్వ, బావ సంపత్‌లపై కేసు నమోదు చేసిన్నట్లు ఎస్ఐ తెలిపారు.

బొల్లారంలో వ్యక్తి..

జిన్నారం (పటాన్‌చెరు): ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన జనంగీ భాస్కరరావు(36) ఐడీఏ బొల్లారం పారిశ్రామిక వాడలో ఉంటున్నాడు. ఓ హోటల్‌లో పని చేసుకుంటూ మద్యానికి బానిసయ్యాడు. 21వ తేదీన తాను పనిచేసే హోటల్ రూమ్ పక్కనే గల రేకుల కింద ఇనుప రాడ్డుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి అన్న కొడుకు బాలరాజు ఫిర్యాదు మేరకు బొల్లారం సీఐ రవీందర్ రెడ్డి కేసు నమోదు చేశారు.

దోపిడీ దొంగల అరెస్ట్

రామాయంపేట(మెదక్): జాతీయ రహదారిపై దారి దోపిడీకి పాల్పడ్డ నలుగురు దుండగుల్లో ఒకరిని సోమవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ బాల్‌రాజ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మంగళవారం రాత్రి రామాయంపేట పట్టణ శివారులోని కేసీఆర్ కాలనీ సమీపంలో గల దాబా వద్ద మహారాష్ట్రకు చెందిన నలుగురు ఆగారు. అదే సమయంలో కత్తులతో అక్కడికి చేరుకున్న నలుగురు గుర్తు తెలియని దుండగులు వారిని బెదిరించారు. నాలుగు సెల్‌ఫోన్లతోపాటు రూ. 5వేల నగదు తీసుకొని పారిపోయారు. ఈ మేరకు బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణలో భాగంగా నిందితుడు కేసీఆర్ కాలనీకి చెందిన గంగారాంను పోలీసులు అరెస్ట్ చేశారు. మిగితా ముగ్గురిని త్వరలో పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు.

ఇంట్లో చోరీకి పాల్పడిన వ్యక్తి

వర్గల్(గజ్వేల్): వర్గల్ మండలం మీనాజీపేటలో తాళం పగులగొట్టి ఓ ఇంట్లో దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని బుధవారం అరెస్ట్ చేసినట్లు గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. కొద్ది రోజుల కిందట మీనాజీపేటలో దొంగలు కర్రెల లక్ష్మి ఇంటి తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. బుధవారం తూప్రాన్ డబుల్ బెడ్రూంలకు చెందిన సిరిగిరి నరసింహులు అనే వ్యక్తిని పట్టుకొని విచారించారు. మీనాజీపేటలో దొంగతనానికి పాల్పడినట్లు అంగీకరించడంతో అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వర్గల్(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం ఉదయం వర్గల్ మండలం గౌరారం వద్ద రాజీవ్‌రహదారిపై చోటు చేసుకుంది. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి కథనం ప్రకారం.. గౌరారం జనతా హోటల్ దగ్గర రాజీవ్ రహదారి దాటుతున్న గుర్తుతెలియని వ్యక్తి(60)ని సిద్దిపేట వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న బైక్ ఢీకొట్టింది. దీంతో రోడ్డుపై పడిపోయాడు. అదే సమయంలో అదే మార్గంలో వెళ్తున్న వాహనాలు కూడా అతడిని ఢీకొట్టడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో బైకిస్టుకు కూడా గాయాలయ్యాయి. మృతుడి ఒంటిపై బ్లూ స్వెటర్, బ్లాక్ ప్యాంట్ ఉందని, ముస్లిం కావొచ్చని ఎస్ఐ తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి..



సాయిలు(ఫైల్)

గజ్వేల్‌రూరల్: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని పిడిచెడ్ గ్రామంలో చోటు చేసుకుంది. గజ్వేల్ పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన నీల సాయిలు(49)కు భార్యతోపాటు కుమారుడు, కూతురు ఉండగా వివాహం జరిపించాడు. కూలీ పనులు చేసుకుంటూ ఉండగా అప్పులు కావడంతో మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలోనే కుటుంబ తగాదాలు జరగడంతో తీవ్ర మనోవేదనకు గురై మంగళవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ

చేగుంట(తూప్రాన్): చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన చేగుంటలో బుధవారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. మండల కేంద్రమైన చేగుంటకు చెందిన మౌనిక(25) ఆదివారం వడియారం రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. రెండు కాళ్లు కోల్పోయిన మౌనికను రైల్వే సిబ్బంది చికిత్స నిమిత్తం కామారెడ్డి రైల్వే ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు



సాయిచరణ్ గౌడ్ (ఫైల్)

దుబ్బాకరూరల్: పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని హబ్సీపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ గంగరాజ్ కథనం మేరకు.. బొల్గం సాయిచరణ్‌గౌడ్(23) కుటుంబ పోషణ కోసం రూ.5 లక్షలు అప్పులు చేశాడు. అప్పులు తీర్చలేక మనస్థాపానికి గురై 11న పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గుర్తించిన కుటుంబీకులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రాజన్నసిరిసిల్లా జిల్లా ఎల్లారెడ్డిపేటలోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు.

అనుమానాస్పద స్థితిలో కార్మికుడు

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామికవాడలోని లీ ఫార్మా పరిశ్రమలో పని చేసే ఓ కార్మికుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. బొల్లారం సీఐ రవీందర్ రెడ్డి కథనం మేరకు.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మనోజ్ (28) స్థానిక లీ ఫార్మా పరిశ్రమలో రోజువారి కూలీగా పని చేస్తున్నాడు. మంగళవారం సెకండ్ షిఫ్టుకు వెళ్లాడు. రాత్రి భోజనం చేసిన తర్వాత అస్వస్థతకు గురై పరిశ్రమ ప్రతినిధులకు సమాచారం అందించాడు. యాజమాన్యం ఎలాంటి చికిత్స అందించకుండా ఇంటికి వెళ్లమన్నారు. బుధవారం మరోసారి తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో మనోజ్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు వెల్లడించారు. మనోజ్ మృతిపై కుటుంబ సభ్యులు అనుమానాలను వ్యక్తం చేశారు. మృతుడి బాబాయి ఫిర్యాదు మేరకు బొల్లారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రేపు ఉమ్మడి జిల్లా క్రికెట్ క్రీడాకారుల ఎంపిక

గజ్వేల్‌రూరల్: తెలంగాణ డిస్ట్రిక్ క్రికెట్ అసోసియేషన్ (టీడీసీఏ) ఆధ్వర్యంలో ఈనెల 24న అండర్–17 బాలుర విభాగంలో ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ క్రీడాకారుల ఎంపిక జరగనుందని ఉమ్మడి జిల్లా కన్వీనర్ హరిశ్చంద్రప్రసాద్ తెలిపారు. బుధవారం పట్టణంలోని ఐవోసీ(ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్) సమీపంలోని మైదానంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ఉమ్మడి జిల్లా బాలుర క్రీడాకారుల ఎంపిక జరగనుందన్నారు. ఎంపికైన వారు ఈనెల 27, 28, 29వ తేదీల్లో హైదరాబాద్ ప్రాంతంలోని దోమలగూడలో గల ఫిజికల్ ఎడ్యుకేషన్ గ్రౌండ్‌లో (పాత 9 జిల్లాలు) ఇంటర్ డిస్ట్రిక్ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు. 2008 సెప్టెంబర్ 1 నుంచి 2010 ఆగస్టు 31 మధ్యన జన్మించిన వారు తమ ఆధార్, బోనఫైడ్‌తో పాటు సొంత క్రికెట్ కిట్, వైట్ జెర్సీతో ఈనెల 24న గజ్వేల్‌లో జరిగే సెలెక్షన్‌కు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 77805–96892 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

శత శాతం ఉత్తీర్ణతకు కార్యాచరణ



సూచనలిస్తున్న డీఐఈఓ రవీందర్‌రెడ్డి

వర్గల్(గజ్వేల్): ఇంటర్ పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. 90 రోజుల యాక్షన్ ప్లాన్‌ను కళాశాల అధ్యాపకులు తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన సందర్శించారు. వివిధ రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థులు 90 శాతం హాజరు ఉండేలా చొరవ తీసుకోవాలని అన్నారు. అధ్యాపకులకు పలు సూచనలిచ్చారు.

చెరుకు లారీ దగ్ధం



దగ్ధమవుతున్న లారీ

జహీరాబాద్ టౌన్: చెరకు లారీ దగ్ధమైన ఘటన మొగుడంపల్లి మండలంలోని గోసాబాద్ గ్రామ పరిధిలో చోటు చేసుకుంది. రైతు సంజీవ్‌రెడ్డి తన పొలంలోని చెరకు పంటను కర్మాగారానికి తరలించడానికి బుధవారం కూలీలు లారీలో పంటను లోడ్ చేశారు. పొలం నుంచి లారీ కర్మాగారానికి వెళ్తున్న సమయంలో పైనున్న కరెంట్ తీగలు తగిలాయి. షార్ట్‌సర్క్యూట్ వల్ల లారీలోని చెరకు పంటకు మంటలు అంటుకొని లారీతో సహా కాలిపోయింది. అప్రమత్తమైన డ్రైవర్ కిందకు దూకాడు. దీంతో ప్రమాదం తప్పింది. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో ఫైర్ ఇంజన్ వచ్చి మంటలార్పివేశారు. ఈ ప్రమాదం వల్ల రూ.వేలల్లో నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు.

కాంగ్రెస్ నాయకులపై బీబీఆర్ఎస్ నాయకుల ఫైర్



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

జిన్నారం (పటాన్‌చెరు): కాంగ్రెస్ పార్టీ నాయకులు దిగజారుడు మాటలు మానుకోవాలని జిన్నారం మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు హెచ్చరించారు. మంగళవారం విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకుల అనుచిత వ్యాఖ్యలపై మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రాజేష్ తాజా మాజీ ప్రజాప్రతినిధులు ఫైరయ్యారు. బొల్లారంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి బీఆర్ఎస్ నాయకులతో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడాన్ని కాంగ్రెస్ జీర్ణించుకోలేదని ఎద్దేవా చేశారు. సొంత పార్టీకి చెందిన ఎమ్మెల్యేతో ఏమైనా భేదాభిప్రాయాలుంటే అంతర్గతంగా చర్చించుకోవాలని హితవు పలికారు. అలా కాకుండా నోటికి వచ్చినట్లుగా మాట్లాడితే చూస్తూ ఊరుకోమన్నారు. అగ్ర నాయకుల వద్ద మెప్పుకోసం మీడియా ముందుకొచ్చి ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడి అబండాలు వేస్తే ఖబర్దార్ అన్నారు. బీఆర్ఎస్ నాయకులపై వ్యక్తిగత దూషణలకు దిగితే రానున్న రోజుల్లో మళ్లీ మా ప్రభుత్వం వస్తుందనే విషయాన్ని గుర్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచులు శివరాజ్, ఆంజనేయులు, చిట్ల సత్యనారాయణ, కౌన్సిలర్లు సతీష్, బీరప్ప యాదవ్, శ్రీకాంత్ యాదవ్, సాయి కిరణ్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ భార్గవ్, పార్టీ నాయకులు రామకృష్ణ, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించండి

పటాన్‌చెరు సీఐ వినాయక్ రెడ్డి



అవగాహన కల్పిస్తున్న సీఐ వినాయక రెడ్డి

పటాన్‌చెరు టౌన్: రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరు పాటించాలని పటాన్‌చెరు సీఐ వినాయక్ రెడ్డి అన్నారు.జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా బుధవారం వాహన తనిఖీ నిర్వహించారు. అందులో సరైన డాక్యూమెంట్స్, నంబర్ ప్లేట్ లేని వాహనాలు 54 ద్విచక్ర వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తీసుకోవచ్చారు. అనంతరం ఆ వాహనాల పత్రాలను పరిశీలించారు, నంబర్ ప్లేట్ లేని వాహనాలకు ప్లేట్ వేయించి వదిలివేశారు.అనంతరం వాహనదారులకు రోడ్డు భద్రత నియమాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ వినాయక్ రెడ్డి మాట్లాడుతూ... వాహనదారులు వాహనానికి సంబంధించిన పత్రాలను తమ వెంట ఉంచుకోవాలని సూచించారు.

ఇంటి నుంచి వెళ్లి.. చెరువులో శవమై తేలి

చిన్ననిజాంపేట గ్రామంలో వ్యక్తి మృతి

దుబ్బాకరూరల్: ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి చెరువులో మృతదేహమై తేలిన ఘటన అక్బర్‌పేట భూంపల్లి మండలం చిన్ననిజాంపేట గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ హరీశ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన షేర్ల రంజిత్(33) ఇంట్లో 21న సాయంత్రం బయటకు వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాలేదు. కుటుంబీకులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. అదే రోజు భూంపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బుధవారం గ్రామ శివారులోని పోతారెడ్డిపేట పెద్ద చెరువు వద్ద బైక్ కనిపించింది. చెరువు వద్ద చెప్పులు,సెల్ ఫోన్ ఆధారంగా చెరువులో గాలించగా రంజిత్ మృతదేహం లభ్యమైంది. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విష గుళికలు తిని నెమళ్లు మృతి



మద్దూరు(హుస్నాబాద్): విష గుళికలు తిని రెండు నెమళ్లు మృతి చెందిన ఘటన మండలంలోని గాగ్గిల్లాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. మండలంలోని గాగ్గిల్లాపూర్ గ్రామానికి చెందిన రైతు గొండ్ల ఇస్తారి రోజు మాదిరిగానే బుధవారం బావి వద్దకు వెళ్లగా అక్కడ రెండు నెమళ్లు మృతి చెంది కనిపించాయి. రైతు విషయాన్ని అటవీశాఖ అధికారులకు చెప్పాడు. అటవీశాఖ అధికారులు వెళ్లి మృతి చెందిన నెమళ్లను పరిశీలించారు. విష గుళికలు తినడం వల్లే మృతి చెందినట్లు వారు నిర్ధారించారు.

అర్హులకే సంక్షేమ పథకాలు

సిద్దిపేటరూరల్: సంక్షేమ పథకాలు అర్హులకు అందించేందుకే గ్రామసభలు నిర్వహిస్తున్నామని అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ అన్నారు. బుధవారం మండలంలో ఉన్న రాఘవాపూర్‌లో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితాలను సభల్లో అధికారులు చదివి వినిపిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మురళీధర్‌శర్మ, పంచాయతీ కార్యదర్శి యాదగిరి, వెంకటి, సంయోద్దీన్, వెంకటేశ్, రఘుపతి, మాజీ ఎంపీపీ శ్రీదేవిచందర్‌రావు, నాయకులు నర్సింహులు, అశోక్‌గౌడ్, రాజు, తిరుపతి, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

నకిరేకొమ్ముల‌లో..

కోహెడరూరల్(హుస్నాబాద్): సంక్షేమ పథకాలు అర్హుల దరిచేరుతాయని అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ అన్నారు. బుధవారం మండలంలోని నకిరేకొమ్ముల‌లో నిర్వహిస్తున్న గ్రామ సభలో ఆయన మాట్లాడారు. ఎలాంటి అవకతవలకు ఆస్కారం లేకుండా అర్హులందరికీ పథకాలు వర్తించేలా చూసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేఖ పాల్గొన్నారు.

వాగ్వాదం



సిద్దిపేటరూరల్: మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

సిద్దిపేటఅర్బన్: సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల, మిట్టపల్లి, బూరుగుపల్లి, కిష్టసాగర్ గ్రామాలలో గ్రామసభలు నిర్వహించగా పొన్నాలలో అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్ పాల్గొన్నారు. అర్హుల లిస్టును అధికారులు చదువుతున్న సందర్భంలో అనర్హులు ఉన్నారంటూ వారిని తొలగించాలంటూ పొన్నాల, మిట్టపల్లి గ్రామాల్లో ప్రజలు అధికారులతో వాగ్వాదానికి దిగారు. అనర్హుల జాబితాను అందిస్తే మరోసారి విచారణ చేసి జాబితా నుంచి తొలగిస్తామని హమీద్ చెప్పడంతో వివాదం సర్దుమణిగింది.